ప్రజాశక్తి

శనివారం 2 నవంబర్ 2024

పెనుకొండలో గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తున్న మంత్రి సవిత

ఉచిత గ్యాస్‌సిలిండర్ల పంపిణీ షురూ

పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభం అయ్యింది. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లను ఇచ్చే పథకానికి శ్రీకారం చుట్టారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని శుక్రవారం నాడు అట్టహాసంగా ప్రారంభించారు. ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా సిలిండర్లను అందించారు. పెనుకొండలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర బిసి, చేనేత సంక్షేమ శాఖ మంత్రి సవిత పాల్గొని మహిళలకు సిలిండర్లు అందించారు. అనంతరం ఆమె గ్యాస్ స్టవ్‌పై టీ చేసి తాగారు.

సిలిండర్ పంపిణీ అనంతరం టీ తయారు చేసిన మంత్రి సవిత

వార్త 6లో

హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యాపారులు, కమీషన్ ఏజెంట్‌లు ఒక్కటై రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. దోపిడీని అరికట్టాల్సిన అధికారులు కమీషన్ ఏజెంట్లతో కలిసి అన్నదాతలకు అన్యాయం చేస్తున్నారు. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలను అమ్ముకునేందుకు మార్కెట్‌యార్డుకు తీసుకుని వస్తే వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు కుమ్మక్కై వారి రాసిందే ధర... వేసిందే తూకం అన్నట్లు తయారైంది. వేలం పంట ద్వారా పంటను కొనుగోలు చేసే సమయంలో అందరూ కుమ్మక్కై ధర, సరుకును తక్కువ చూపిస్తున్నారు. అదేమిటని రైతులు అడిగితే కనీసం పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

వేసిందే తూకం..రాసిందే ధర..!

'పురం' మార్కెట్‌యార్డులో దోపిడీ

వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు కుమ్మక్కు

రైతులకు అడుగడుగునా మోసం

ప్రజాశక్తి-హిందూపురం

రైతులు సాగు చేసిన పంటను అమ్మకానికి మార్కెట్‌యార్డుకు తీసుకుని వస్తే గిట్టుబాటు ధర కల్పించి వారిని ఆదుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. అందులో భాగంగానే ప్రభుత్వం మార్కెట్‌యార్డులను ఏర్పాటు చేసింది. వేలం పాట, ఈనామ్ తదితర విధనాల్లో పంట కొనుగోళ్లు చేస్తున్నారు. హిందూపురం మార్కెట్‌యార్డులో వేలం పాటద్వారానే పంటను కొనుగోలు చేస్తున్నారు. ఈ సమయంలో వ్యాపారులు కమీషన్ ఏజెంట్లతో కుమ్మక్కై బహిరంగ వేలం అంటూ వారి చెప్పిన ధరకే పంట అమ్మేలా వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు బాగుంటేనే మనకు బాగా ముడులుపు అందుతాయన్న విధంగా హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డు అధికారులు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.

అంతా '0'(జీరో) బిజినెస్

బహిరంగ వేలం ద్వారా మిర్చి పంట కొనుగోలు వ్యాపారులు 20 నుంచి 30 శాతం లెక్కలు చూపించి మిగిలిన వ్యాపారాన్ని 0(జీరో) బిజినెస్‌గా చూపిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. నిబంధనల మేరకు 20 కిలోల తూకానికి ఒక కిలో తూకం అదనంగా తీసుకుంటున్నారు. మార్కెట్ నిబంధనల మేరకు రూ.100కు 2శాతం కమీషన్ ఉంటే ఇక్కడ మాత్రం 4శాతం తీసుకుంటున్నారు. వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు రైతులకు నగదు అప్పు ఇచ్చింటే ఒక శాతం పెంచి ఐదు శాతం కూడా తీసుకుంటున్నారు. ఇలా హిందూపురం వ్యవసాయ మార్కెట్‌లో దళారులు రాసిందే ధర... వేసిందే తూకం అన్న చందంగా వ్యాపారాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌యార్డులో మర్చి వ్యాపారం జరుగుతోంది. ఇందులో బ్యాడిగెర రకం బయట మార్కెట్లో కిలోఉండగా రూ.350 ఉండగా, పురం మార్కెట్‌యార్డులో రూ.150కే వేలంలో తీసుకుంటున్నారు. గుంటూరు మిర్చీ బయట మార్కెట్లో రూ.200 నుంచి రూ.250 వరకు ఉంది. దీనిని పురం మార్కెట్లో రూ.120 నుంచి రూ.150 మధ్యన తీసుకుంటున్నారు. స్థానికంగా పండించే మిర్చి బయట కిలో రూ.200 ఉండగా, ఇక్కడ రూ.120 నుంచి రూ.150 మధ్యలో కొనుగోలు చేస్తున్నారు. ఇలా ప్రతి పంటపైనా బయట మార్కెట్‌కు హిందూపురం మార్కెట్‌యార్డులో ధరలో రూ.100కు పైనా వ్యత్యాసం కన్పిస్తోంది. ఇదంతా వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు కుమ్మక్కు కావడం, వారికి అధికారులు సహకరించడం వల్ల రైతులు నష్టపోతున్నారు.

మార్కెట్‌లో వేలం నిర్వహిస్తున్న అధికారులు, వ్యాపారులు

ఈ-నామ్ బంద్

ఈ-నామ్ అమలుకు హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రత్యేక కంప్యూటర్లతో పాటు ప్రత్యేక సిబ్బంది ఉన్నారు. వారు విధులు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నా కొంత మంది మార్కెట్‌లో పని చేసే అధికారులు కావాలనే దీనిని అడ్డుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ-నామ్ పూర్తి స్థాయిలో అమలు జరిగితే మార్కెట్ అధికారులకు వచ్చే మాముళ్లు అందవన్న కారణంతో అడ్డుకుంటున్నట్లు తెలుస్తోంది.

కొందరు వ్యాపారులదే హవా

హిందూపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో అనాదిగ కొంతమంది మాత్రమే వ్యాపారాలకు ట్రేడ్ లైసెన్స్ పొందారు. వారు చెప్పిందే మార్కెట్‌లో వేదం. కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు కలిసి శాసిస్తే దాన్ని అధికారులు తూచా తప్పకుండా పాటించాల్సిందే. వ్యాపారులు గ్రామాలకు వెళ్లి పంట కొంటామంటూ రైతులకు కొంత అడ్వాన్స్ రూపంలో మందస్తుగా ఇస్తున్నారు. అడ్వాన్స్ తీసుకున్న రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో వ్యాపారులు ఎంత ధర చెబితే అంత ధరకు పంటను అమ్మేయాల్సిన పరిస్థితి ఉంది.

గిట్టుబాటు ధర వస్తే చాలంటున్న రైతులు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-నామ్ కావొచ్చు... బహిరంగ వేలం కావొచ్చు ఏ పద్ధతిన వ్యాపారాలు చేసినా పంటకు గిట్టు బాటు ధర ఇస్తే చాలంటు రైతులు అభిప్రాయ పడుతున్నారు. పంట పండించడానికి పగలూ రాత్రి కష్టపడి కంటికి రెప్పల కాపాడుకొని మార్కెట్‌కు తీసుకొస్తే వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు ఒక్కటై గత వారం తీసుకొన్న సరుకులు అమ్ముడు పోలేదని, ప్రస్తుతం ధరలు ఆమాంతంగా తగ్గాయని మభ్యపెట్టి ధరలను తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. బయట మిర్చి ధరలు చూస్తే భగభగ మండుతున్నాయి. ఇక్కడ చూస్తే అమాంతంగా తగ్గినాయని, పంట కోసం వెచ్చించిన పెట్టుబడి సైతం మాకు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అనంత కలెక్టరేట్‌లో గన్ మిస్‌ఫైర్

ఎఆర్ హెడ్ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

అనంతపురం కలెక్టరేట్లో ప్రమాదశాత్తు గన్‌మిస్‌ఫైర్ అయ్యింది. ఈ ఘటనలో ఎఆర్ హెడ్ కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడ్డాడు. శుక్రవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి... 1996 బ్యాచ్‌కి చెందిన ఎఆర్ హెడ్ కానిస్టేబుల్ సుబ్బరాజు కలెక్టరేట్‌లోని ట్రెజరీలో విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం తెల్లవారు జామున 4.30 గంటల సమయంలో ఆయన తుపాకీని శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు మిస్ ఫైర్ అయ్యింది. గన్ నుంచి బుల్లెట్ కానిస్టేబుల్ భుజంలోకి దూసుకెళ్లింది. గమనించిన సహచరులు వెంటనే ఆయన్ను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు శస్త్ర చికిత్స చేశారు. ప్రస్తుతం హెడ్‌కానిస్టేబుల్ సుబ్బరాజు ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

మొరాయించిన108.. ఇబ్బందుల్లో రోగులు..

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని మోరు బాగల్ గ్రామ సమీపంలో శుక్రవారం ప్రభుత్వ 108 వాహనం మొరాయించింది. మార్గ మధ్యలో వాహనం చక్రం కాస్త బయటకు రావడంతో అప్రమత్తమైన డ్రైవర్ వాహనాన్ని రోడ్డు పక్కనే ఆపారు. ఆ సమయంలో వాహనంలో ఉన్న రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కేటాయించిన 108 వాహనాలకు కాలం చెల్లడంతో తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. మెకానిక్‌లు అందుబాటులో లేకపోవడంతో 108 సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మొరాయించిన 108 వాహనం

108 సూపర్‌వైజర్ రవీంద్ర వివరణ

చిన్నసాంకేతిక లోపం వల్ల 108 వాహనం మోరుబాగల్ గ్రామం సమీపంలో మొరాయించింది. అనంతపురం నుంచి వచ్చిన మెకానిక్ మరమ్మతులు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ఉన్న కొన్ని వాహనాలు కాలం చెల్లిన మాట వాస్తవమే. ఈ విషయాన్ని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు దృష్టికి తీసుకెళ్లాం. స్పందించిన ఎమ్మెల్యే అతి త్వరలోనే విజయవాడలో సంబంధిత అధికారులతో చర్చించి కొత్త వాహనాలు కేటాయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పోలీసుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-పెనుకొండ

పోలీసు అమర వీరుల దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలోని ఎం క్యూ ఎ గ్లోబల్ ట్రస్ట్ కార్యాలయంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సిఐ రాఘవన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ రక్తదానం చేయడం అంటే మరొకరికి పునర్జన్మ ప్రసాదించడమే అవుతుందన్నారు. శిబిరంలో పెనుకొండ సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, ఎఎస్ఐలు, కానిస్టేబుళ్లు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్‌తో పాటు ఎస్ఐలు వెంకటేశ్వర్లు, రాజేష్, నరేంద్ర, రమేష్, టిడిపి సీనియర్ నాయకులు వెంకటేశ్వరరావు, పట్టణ కన్వీనర్ శ్రీరాములు, నాయకులు అశ్వర్థనారాయణ, బాబుల్‌రెడ్డి, షౌకత్, సుబ్బి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శిబిరంలో రక్తదానం చేస్తున్న పోలీసు అధికారులు

నేడు 'పల్లె పండుగ'ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-గుడిబండ

మండల కేంద్రమైన గుడిబండలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే పల్లె పండుగ కార్యక్రమంలో మండలంలోని టిడిపి, జనసేన, బిజెపి, నాయకులు, కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని టిడిపి మండల కన్వీనర్ మద్దనకుంటప్ప కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి హాజరై సీసీ రోడ్లకు భూమిపూజ చేస్తారని తెలిపారు.

మద్దనకుంటప్ప

ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలో శుక్రవారం బహుజన చైతన్యవేదిక ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ ఆధ్వర్యంలో సభ్యులు తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో వేదిక గౌరవాధ్యక్షులు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి రవికుమార్, కోఆర్డినేటర్ నరసింహులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి పైడేటి రాందాస్, రాము, ఆంధ్రూస్, కొల్లప్ప, అంజనప్ప, నాగరాజు, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల వేసిన బహుజన చైతన్య వేదిక సభ్యులు

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే ఎంఎస్.రాజు

ప్రజాశక్తి-మడకశిర

ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అందులో భాగంగానే సిఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను దశల వారీగా అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు తెలిపారు. పట్టణంలోని అమరాపురం బస్టాండ్‌లో శుక్రవారం నిర్వహించిన ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్యాస్ సిలిండర్ల వాహనాన్ని నడిపారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందించాలంటే ప్రభుత్వంపై రూ. 21.3 కోట్ల భారం పడుతుందన్నారు. గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను నిర్వీ ర్యం చేసి అప్పుల పాలు చేసిందన్నారు. రాష్ట్రంలో సంపద సృష్టించి ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం పని చేస్తుంద న్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, అభివృద్ధి పనులను దశల వారీగా పూర్తి చేయడానికి సిఎం చంద్రబాబు ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ రంగస్వామి, తహశీల్దార్ కరుణాకర్, సిఎస్‌డిటి లక్ష్మీనరసింహ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, వీఎం.పాండురంగప్ప, మండల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, దాసిరెడ్డి, గణేష్, మద్దనకుంటప్ప, కుమారస్వామి, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి బిఎస్.గురుమూర్తి, మాజీ ఎంపీపీలు, కృష్ణమూర్తి, మీనాక్షి, రామిరెడ్డి, తెలుగు యువత తాలూకా అధ్యక్షుడు బాలకృష్ణ, సీనియర్ టిడిపి నాయకుడు కొత్తపల్లి శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

తితిదే సభ్యులుగా ఎన్నికైన ఎమ్మెల్యేకు ఘన సన్మానం

తిరుమల తిరుపతి దేవస్థానం(తితిదే) పాలక మండలి సభ్యులుగా ఎన్నికైన తర్వాత తొలిసారి మడకశిరకు వచ్చిన ఎమ్మెల్యే ఎంఎస్.రాజును పట్టణంలోని రహదారుల విశ్రాంతి భవనంలో టిడిపి, జనసేన, బిజెపి నాయ కులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గుండుమల తిప్పేస్వామి, శ్రీనివాస్‌మూర్తి, వీఎం.పాండురంగప్ప, గురుమూర్తి, మండల కన్వీనర్లు, ఆసుపత్రి కమిటీ మెంబర్లు కృష్ణమూర్తి, మారుతిరెడ్డి, అశ్వత్థమప్ప, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్, గుండుమల తిప్పే స్వామి సోదరుడు గుండుమల జయప్ప ఎమ్మెల్యే ఎంఎస్ రాజును ఘనంగా సన్మానించారు. జయప్ప మాట్లాడుతూ ఎమ్మెల్యే రాజు మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు.

ఎమ్మెల్యే రాజుకు సన్మానం

గుడిబండ : మండలంలోని జమ్మలబండ గ్రామానికి చెందిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి సోదరుడు, మాజీ సర్పంచ్ శ్రీనాథ్ తన నివాసంలో ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తిని శాలువాలతో సన్మా నించారు. అంతకుముందు వారు శ్రీనాథ్ ఇంట్లో విందు భోజనం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, జయరాం, మంజునాథ్ పాల్గొన్నారు.

మడకశిరలో ఎమ్మెల్యే , తితిదే పాలకమండలి సభ్యులు ఎంఎస్.రాజును సన్మానిస్తున్న నాయకులు

రాయలసీమపై పాలకుల నిర్లక్ష్యం

ప్రజలను మభ్యపెట్టడానికే జమిలి ఎన్నికలు
15 నుంచి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు
సిపిఎం కేంద్రకమిటీ సభ్యుడు ఎం.గఫూర్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

కరువు ప్రాంతంగా తీవ్ర దుర్భిక్షంలో ఉన్న రాయలసీమ జిల్లా అభివృద్ధిపై పాలకుల నిర్లక్ష్యం అడుగడుగునా కొనసాగుతోందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఎ.గఫూర్ విమర్శించారు. శుక్రవారం ఆయన పుట్టపర్తిలోని సిపిఎం కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు వి.రాంభూపాల్, జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలు ఆ ప్రభుత్వంపై కోటి ఆశలు పెట్టుకున్నారన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పాలన సాగించాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి గతంలో రాయలసీమ డిక్లరేషన్ ప్రకటించినప్పటికీ ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి, పోలవరం గురించి కేంద్రాన్ని అడుగుతున్నారు తప్ప రాయలసీమ, వెనుకబడిన ప్రాంతాల అభివద్ధి గురించి అసలు పట్టించుకోవడం లేదన్నారు. రాయలసీమలో వెనుక బడిన ప్రాంతాల అభివద్ధి జరగాలంటే పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేయాలన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలన్నారు. వెనుకబడిన ప్రాంతాలకు ప్యాకేజీలు, నిధులు తేవడం కాదని పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసి ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడం అన్నారు. మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరిగినపుడు పోలీసు వ్యవస్థ కఠినంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో అలాంటి ఘటనలు పునరావృతం కావన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా కరువు విలయతాండవం చేస్తుంటే కొన్ని మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం సమంజసం కాదన్నారు. అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులను ఆదుకునే చర్యలను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు.

విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్

ప్రజలను మభ్యపెట్టడానికి జమిలి ఎన్నికలు : రాంభూపాల్

ప్రజలను మభ్యపెట్టడానికే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జమిలి ఎన్నికల ప్రస్తావన తెరపైకి తెస్తోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు వి.రాంభూపాల్ విమర్శించారు. జమిలీ ఎన్నికల వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థకు నష్టం వాటిల్లుతుందన్నారు. నిరుద్యోగం, మహిళలపై అఘాయిత్యాలు, ధరల పెరుగుదల తదితర సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికల పేరు జపిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ధరల నియంత్రణను గాలికి వదిలేయడం వల్ల ఈ ఏడాది వంద నుంచి 300 శాతం వంటనూనెల ధరలు పెరిగాయన్నారు. బియ్యం, కందిపప్పు ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయని చెప్పారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వాలను ప్రశ్నించేలా నవంబర్ 15 నుంచి 30వ తేదీ వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించి, ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్ర రహదారుల మరమ్మతులు : మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

'పల్లె పండుగ' పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తున్నామని, శనివారం నుంచి రాష్ట్ర రహదారుల మరమ్మతులు చేపడతామని రాష్ట్ర బిసి, ఈడబ్ల్యుఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత వెల్లడించారు. మండలంలోని మావుటూరులో శుక్రవారం నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛను మొత్తం అందజేస్తూ, వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడారు. సామాజిక భద్రత పింఛన్లు ఇచ్చిన ఘనత ఎన్టీఆర్‌దే అన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సిఎం చంద్రబాబు పింఛను మొత్తాన్ని రూ.4 వేలకు పెంచి ప్రతి నెలా 1వ తేదీ ఇంటి వద్దే అందజేస్తున్నారన్నారు. వైసిపి హయాంలో జగన్ తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేశారన్నారన్నారు. మెగా డీఎస్సీ ఫైలుపై తొలి సంతకం చేశారన్నారు. అన్న క్యాంటీన్లను పున:ప్రారంభించి పేదల ఆకలి తీరుస్తున్నారన్నారు. ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తున్నామన్నారు. డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ కలిగేలా చర్యలు తీసుకున్నారన్నారు. ప్రతి టిడిపి కార్యకర్త సభ్యత్వ నమోదు చేసుకోవాలని సూచించారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పేదలకు వరం

కూటమి ప్రభుత్వం అందజేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పేదలు, నిరాశ్రయులకు వరం అని మంత్రి సవిత తెలిపారు. పట్టణంలోని శ్రీరాములయ్య కాలనీలో చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ కన్వీనర్ శ్రీరాములు యాదవ్, మండల కన్వీనర్ సిద్దయ్య, మాజీ జెడ్పిటిసి వెంకటరాముడు, అశ్వర్థనారాయణ, సూర్యానారాయణ, గోపాల్, పాల్గొన్నారు.

దీపావళి కానుక 'దీపం-2'

పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం 'దీపం-2'ను మంత్రి సవిత ప్రారంభించి మాట్లాడారు. నియోజక వర్గంలో 90,392 గ్యాస్ కనెక్షన్ల లబ్ధిదారులకు ఈ పథకం వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో ఆనంద్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, తహశీల్దార్లు శ్రీధర్, హసీనా సుల్తానా, సిఎస్‌డిటి ప్రభావతి, టిడిపి మండల కన్వీనర్ సిద్దయ్య, పట్టణ కన్వీనర్ శ్రీరాములు, మాజీ జడ్పిటిసిలు నారాయణస్వామి, వెంకటరాముడు, వెంకటరమణ పాల్గొన్నారు.

రొద్దం చిన్నచెరువు మరమ్మతులు చేపట్టాలని వినతి

రొద్దం : రొద్దం చిన్నచెరువు మరమ్మతులు చేపట్టాలని కోరుతూ ఆయకట్టుదారులు పెనుకొండ మండలం మావటూరులో మంత్రి సవితను కలిసి వినతిపత్రం ఇచ్చారు. స్పందించిన మంత్రి ఆయా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. వినతి ఇచ్చిన వారిలో నాగభూషణంగౌడ్, పెద్ద చిక్కులరెడ్డి, ఉమాశంకర్, తిరుపాల్‌నాయుడు, రొద్దం డీలర్ల సంఘం అధ్యక్షులు పైగేరి సిద్దన్న ఉన్నారు.

మహిళాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - కదిరి అర్బన్

కూటమి ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం అని ఎన్నికలల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను నెరవేర్చేందుకు అంకితభావంతో పనిచేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని శాసనసభ్యులు కందికుంట వెంకట ప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణం పరిధిలోని సిరికల్చర్ మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం దీపం 2 అమలుతో మహిళల కళ్ళల్లో ఆనందం కనబడుతోందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 130 రోజుల్లోనే ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి నెరవేర్చుతున్నామన్నారు. ఈసందర్భంగా అంబేద్కర్ సర్కిల్ నందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకంచేశారు. మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో,మున్సిపల్ కమిషనర్, స్వర్ణ భారత్ గ్యాస్ ఏజెన్సీ చంద్రమౌళి రెడ్డి, కళాధర్ రెడ్డి, రవి, గ్యాస్ ఏజెన్సీ సుదర్శన్ రెడ్డి, కూటమి నాయకులు భైరవ ప్రసాద్ అనిల్ కుమార్ రెడ్డి, పర్వీన్ భాను, మనోహర్ నాయుడు, తలుపుల గంగాధర్, టిడిపి నాయకులు, కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : మహిళల ఆర్థిక అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని ఎమ్మెల్యే సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని సాయి ఆరామం లో ఆర్డీవో సువర్ణ అధ్యక్షతన ప్రశాంతి గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో జరిగిన దీపం-2 పథకాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తో పాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రారంభించారు. తాజాగా గ్యాస్ బుక్ చేసుకున్న మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందించారు. అనంతరం ఎనుములపల్లి లో ఆర్డీవో తో పాటు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులు సాకల పూతప్ప టైలర్ ఆనంద్ నివాసానికి వెళ్లి గ్యాస్ సిలిండర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూమహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందించి ఆర్థిక భారం నుంచి పేదలను గట్టెక్కించారని పేర్కొన్నారు. ఈ నియోజకవర్గంలో 83583 గ్యాస్ కనెక్షన్లకు ఈ పథకం ద్వారా ఏడాదికి 3 సిలిండర్లకు కలిపి రూ. 21, 92, 79, 999లు ఖర్చువుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద, పుట్టపర్తి నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ శుభదాస్, మండల ఇన్‌ఛార్జి తహశీల్దార్ కళ్యాణ్, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు అమరేశ్వరి రాజీవ్ దేవ్, సివిల్ సప్లై అధికారులు, ముస్లిం మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ రఫీ, మాజీ పూడా చైర్మన్ సుధాకర్ నాయుడు, టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మాజీ మున్సిపల్ చైర్మన్ పి సీ గంగన్న, మాజీ మున్సిపల్ చైర్మన్ బెస్త చలపతి, నాయకులు శ్రీరామ్ రెడ్డి, పుల్లప్ప, జనసేన బిజెపి కూటమి నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల

దీపం -2 పంపిణీలో ప్రజాప్రతినిధులు

సంక్షేమం కోసం పనిచేస్తోందని హిందూపురం పార్లమెంటు సభ్యులు బికె. పార్థసారథి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయ ఆవరణలో దీపం- 2 ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకాన్ని ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ హామీ ఇచ్చిన ప్రతి పథకాన్ని ఖచ్చితంగా అమలు చేస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నేతృత్వంలో హిందూపురం నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు వడ్డే అంజనప్ప, పట్టణ అధ్యక్షులు డిఇ. రమేష్ కుమార్, నాయకులు బేవిన హళ్లి ఆనంద్ కుమార్, హెచ్ఎన్.రాము, రాఘవేంద్ర, తిరుపతయ్య, రామాంజినమ్మ, అయూబ్, తహశీల్దార్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : మహిళాభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ అన్నారు. ఈ మేరకు ఆయన రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతతో కలిసి స్థానిక తహశీల్దార్ కార్యాలయ సమీపంలో గల లక్ష్మీ ఏజెన్సీస్‌లో ఉచిత వంటగ్యాస్ పంపిణీ పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ చేతన్, జనసేన రాష్ట్ర నాయకులు చిలకం మధు సూదన్ రెడ్డి, హెచ్ పి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు గోవిందచౌదరి మహిళలు పాల్గొన్నారు.

గ్యాస్ పంపిణీ చేస్తున్న కదిరి ఎమ్మెల్యే కందికుంట

దీపం -2 పథకం ప్రారంభిస్తున్న పుట్టపర్తి ఎమ్మెల్యే, తదితరులు

దీపం -2 పథకం ప్రారంభిస్తున్న ఎంపీ పార్థసారథి

దీపం -2 పథకం ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే పరిటాల సునీత

మొక్కలు పంపిణీ

కొత్తచెరువు : దీపావళి పండుగ సందర్భంగా మానవ హక్కుల సంఘం నాయకుల ఆధ్వర్యంలో పండ్ల మొక్కలను పంపిణీ చేశారు ఈ మొక్కలను కొత్తచెరువు అమ్మ దేవాలయం ప్రాగణంలో నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలకు వెయ్యి మొక్కలను నాటాలని పంపిణీ చేశామన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పచ్చదనం అభివృద్ధికి కృషి చేయాలని వారు సూచించారు ఈ కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం నాయకులు భాస్కర్ నాయుడు, నితిన్, మిత్ర, ఉపేంద్ర, వేణు, రాకేష్, బిట్టు, గణేష్, అభి, అనిల్, శారద, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండలంలోని కట్టారుపల్లి క్రాస్ వద్ద ఉన్న కేజీబివి విద్యార్థినులకు శుక్రవారం వైద్యపరీక్షల నిర్వహించారు. డ్రైడే కార్యక్రమం భాగంగా వైద్యాధికారి మహేశ్వరి మారుతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. 30 మంది దాకా జలుబు దగ్గు తలనొప్పి ఉండడంతో మాత్రలు సిరప్‌లు పంపిణీ చేశారు. అలాగే పాఠశాల ఆవరణంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ దుర్గ, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ డి రామంజులు, సూపర్వైజర్ మహబూబ్ బాషా, పీహెచ్‌సి సూపర్వైజర్ ఉపేంద్ర రెడ్డి, సిబ్బంది వై రవికుమార్, ఆశ వర్కర్లు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

రిటైర్డ్ ఎస్ఐకు సన్మానం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం ఉద్యోగ విరమణ పొందిన ఎస్ఐ కాశీంను జిల్లా ఎస్పీ సత్కరించారు. పెనుగొండ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కాశీం ఉద్యోగ విరమణ పొందడంతో శుక్రవారం సాయంత్రం కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎస్పీ వి.రత్న కాశీంను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఎఆర్ డిఎస్పి విజయ్ కుమార్, ఏవో సుజాత ఆర్ఐలు వలి, మహేష్, డిపిఓ సిబ్బంది పాల్గొన్నారు.

రేగాటిపల్లి చెరువులో జలహారతి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం మండలం రేగాటిపల్లి చెరువు వద్ద నిర్వహించిన జలహారతి కార్యక్రమంలో కుటుంబ సంక్షేమ, ఆరోగ్య, వైద్య విద్య శాఖల మంత్రి సత్య కుమార్ యాదవ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన రెడ్డి పాల్గొన్నారు. అనంతరం రేగాటిపల్లి ముచ్చురామి ఎస్సీ కాలనీ రోడ్లక శంకుస్థాపన చేశారు. అనంతరం ముచ్చురామి గ్రామ బ్రిడ్జిను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మహేష్ చౌదరి, డోలా రాజారెడ్డి, జయరాం రెడ్డి, చిలకం వెంకటరెడ్డి, సుధాకర్ రెడ్డి, శివారెడ్డి, తాతి రెడ్డి, ముచ్చురామి కిష్టా, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - బుక్కపట్నం

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని కృష్ణాపురం, మారాల, పాముదుర్తి, సిద్దారాం పురం గ్రామాల్లో ఎమ్మెల్యే,మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు మాసాల్లోనే ఎన్నికల్లో ఇచ్చిన అనేక హామీలను నెరవేర్చి మాట నిలుపుకుందన్నారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ షాబుద్దీన్, ఎంపీడీవో శ్రీనివాసులు, టిడిపి మండల కన్వీనర్ మల్లిరెడ్డి, నాయకులు గంగాధర్, సుబ్బారెడ్డి, వెంకట రాముడు, కృష్ణమూర్తి, కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

తనకల్లును కరువు మండలంగా ప్రకటించాలి

ధర్నాలో పాల్గొన్న సిపిఎం, కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి - తనకల్లు

తనకల్లు మండలాన్ని కరువుమండలంగా ప్రకటించాలని కోరుతూ సిపిఎం, కాంగ్రెస్‌న ఆయకులు శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తనకల్లు మండల వ్యాప్తంగా సుమారు 4వేల పైచిలుకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఉన్నాయన్నారు. ఈ ఏడాది రైతులు వర్షాభావ పరిస్థితుల వల్ల తీవ్రంగా నష్టపోయారన్నారు. గత ఏడు సంవత్సరాల నుండి పంటలు పండక రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో తనకల్లు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించకుండా అధికారులు చేసిన తప్పిదానికి రైతులు అన్యాయం అవుతున్నారన్నారు. సూపర్ సిక్స్ అనిహామీలు ఇచ్చి ప్రస్తుతం రైతులకు, కార్మికులకు, కర్షకులకు, పేద ప్రజలకు శఠగోపం పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకల్లు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని, రైతు రుణాలు రద్దు చేయాలని, ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ శివన్న, రైతు సంఘం నాయకులు వివి.రమణ, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ పారేశు, కౌన్సిల్ మెంబర్. ఓ.వేమన్న ఎమ్మార్పీఎస్ శంకర తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ధర్మవరం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, ఆయాల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు నాయకులు కోరారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు. ధర్మవరం మున్సిపల్ పాఠశాలలో దాదాపు 30 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులకు కేవలం 4వేల రూపాయల వేతనం ఇస్తున్నారని చెప్పారు. చాలీచాలని వేతనాలతో వారి కుటుంబాలు అనేక రకాలు ఇబ్బందులు గురవుతున్నాయని వివరించారు. వారికి కనీసం 10వేల రూపాయలు వేతనం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో 2019 సంవత్సరం నుంచి స్వచ్ఛభారత్ కార్మికుల పేరుతో శానిటేషన్ వర్కర్స్ కేవలం 6వేల రూపాయల వేతనంతో పనిచేస్తున్నారని వారికి కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ జెవి. రమణ, సిఐటియు నాయకులు ఎల్ ఆదినారాయణ, చౌడమ్మ, జయమ్మ, ముంతాజ్, ఐ. లక్ష్మీదేవి, పర్వీనా, వెంకటలక్ష్మి కార్మికులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కదిరి విద్యార్థి

ప్రజాశక్తి - కదిరిటౌన్

యోగేంద్రనాయక్

కదిరి పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ లో చదువుతున్న యోగేంద్ర నాయక్ అండర్ 14 ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. గుంటూరు జిల్లా తెనాలిలో నిర్వహించిన అండర్ 14 ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో జిల్లా హ్యాండ్ బాల్ జట్టు తరపున పాల్గొన్న యోగేంద్రనాయక్ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి జట్టుకు ఎంపికయ్యారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన యోగేంద్ర నాయక్‌ను హ్యాండ్ బాల్ కోచ్ మహేష్, పే బ్యాక్ టు సొసైటీ వారు అభినందించారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలం యాకర్లకుంటపల్లి గ్రామానికి చెందిన నారాయణస్వామి కర్నాటక మద్యం ప్యాకెట్లు తరలిస్తుండగా అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. అతని వద్దనుంచి 96 టెట్రా ప్యాకెట్లు, సరఫరాకు వినియోగించిన వాహనం స్వాధీనం చేసుకున్నట్లు ముదిగుబ్బ అప్‌గ్రేడ్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ అశోక్ తెలిపారు.

బాధితులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని పలు గ్రామాల్లోని బాధితులను మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పరామర్శించారు. మండల పరిధిలోని పైపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు మాధవప్ప ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. దీంతో మాజీ ఎమ్మెల్యే పైపల్లి గ్రామానికి వెళ్లి మాధవప్ప చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం బుగ్గ పల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు వెంకప్ప ఇటీవల మృతిచెందడంత ఆ గ్రామానికి వెళ్లి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్, నర్సారెడ్డి, మాజీ కన్వీనర్ గంగాద్రి, వైసిపి ఎస్సీసెల్ జిల్లా నాయకులు తిరుపాల్ నాయక్, నతీష్ రెడ్డి ,మాజీ డీలర్ రామచంద్ర, మార్లపల్లి చంద్ర, పైపల్లి, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

విద్యతో సమాజంలో గౌరవం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర

ప్రజాశక్తి - బుక్కపట్నం

విద్యతోనే ప్రతి మనిషికి సమాజంలో తగిన గుర్తింపు, గౌరవం లభిస్తుందని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ప్రభుత్వ డైట్ కళాశాలను ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీవితంలో మనిషి రాణించాలంటే విద్య ఒక్కటే మార్గమన్నారు. డైట్ కళాశాల విద్యార్థులు కష్టపడే తత్వాన్ని అలవర్చుకుంటే భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాన్ని సులువుగా పొందవచ్చని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తిలో రాణించాలంటే విద్యార్థులకు అనుగుణంగా విద్యా బోధన చేయాలని తెలిపారు. విద్యార్థులకు అనుగుణంగా విద్యాబోధన సాగించి వారిలో మంచి ఉపాధ్యాయుడిగా ముద్ర పడేలా బలమైన నమ్మకం కలిగించాలని పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం అతి త్వరలో మెగాడీఎస్సీని నిర్వహిస్తోందని అందులో ప్రతి ఒక్కరు విజయం సాధించి ఉపాధ్యాయ ఉద్యోగాన్ని పొందాలని అన్నారు. మాజీ మంత్రి మాట్లాడుతూ తాను ఉపాధ్యాయ వృత్తి నుంచి ఎదుగుతూ రాజకీయరంగంలో ఉన్నత స్థానానికి ఎదిగానని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎమ్మెల్యేను ఇంత చిన్న వయసులో ఎందుకు రాజకీయాలలోకి అడుగు పెట్టారని అడగగా స్పందించిన ఆమె చిన్న వయసులోనే విద్యతోపాటు లైఫ్ ఎంజాయ్ చేశానని, రాజకీయాల్లో తన జీవితాంతం ప్రజలకు సేవ చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైట్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రామకృష్ణ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి చేయూత

ప్రజాశక్తి - బత్తలపల్లి

తాను అభ్యసించిన పాఠశాల విద్యార్థులకు తన వంతు సహకారంగా పూర్వపు విద్యార్థి చేయూతను అందించారు. మండలంలోని రామాపురం ఉన్నత పాఠశాలలో రామాపురం గ్రామానికి చెందిన పూర్వపు విద్యార్థి సాఫ్ట్వేర్ ఇంజనీర్ ప్రవీణ్ కుమార్ తాను చదువుకున్న పాఠశాలలోని విద్యార్థులకు స్పోర్ట్స్ మెటీరియల్, 8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పరీక్షకు సంబంధించిన మెటీరియల్ అందజేశారు. మెటీరియల్ ను ప్రధానోపాధ్యాయులు వెంకటనాయుడు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. పూర్వపు విద్యార్థి ప్రవీణ్‌కుమార్‌కు ఉపాధ్యాయులు అభినందించారు.

హోటళ్ల నిర్వహణకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి-హిందూపురం

హోటళ్లు, టిఫిన్ సెంటర్ నిర్వహణకు అనుమతులు తప్పనిసరి అని ఆహార భద్రత అధికారిణి తస్లీం అన్నారు. శుక్రవారం ఆహార భద్రత అధికారులు పట్టణంలో పలు హోటళ్లపై దాడులు నిర్వహించారు. విడి రోడ్డులో ఉన్నా శ్రీనివాస టిఫిన్ సెంటర్, రాఘవేంద్ర టిఫిన్ కార్నర్. పెనుకొండ రోడ్డులో ఉన్న ఎన్‌జిఓ క్యాంటీన్, ఆర్‌టిసి బస్టాండ్ ఎదురుగా ఉన్న వైశాలి హోటల్‌ను తనఖీ చేశారు. అనుమతులు లేని వాటికి నోటీసులు జారీ చేశారు. అదే విధంగా పార్శిల్ కోసం ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ డబ్బాలను వినియోగించరాదని సూచించారు. వైశాలి హోటల్‌లో ఇడ్లీలను సీజ్ చేసి, హైదరాబాదు ల్యాబ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఆహార పదార్థాల తయారీకి నాణ్యమైన సరుకులను వాడాలన్నారు. నాణ్యత లోపిస్తే కేసులను నమోదు చేయడంతో పాటు చట్ట రీత్య చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆహార భద్రత శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వివాహిత దారుణహత్య

ప్రియుడే హంతకుడు- నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్,ఓబుళదేవరచెరువు

జిల్లాలో సంచలనం సృష్టించిన ఓబుళదేవరచెరువు మండలం కొండకమర్లలో మెహతాజ్(35) హత్య కేసులో ప్రియుడే హంతకుడని పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్ తెలిపారు. తనతో కాకుండా మరొకరితోనూ ఆమె సన్నిహితంగా ఉండటాన్ని జీర్ణించుకోలేక ప్రియుడే తన ప్రియురాలి గొంతు నులిపి చంపినట్లు తమ విచారణలో తేలిందని డీఎస్పీ తెలిపారు.కొండకమర్ల గ్రామానికి చెందిన మెహతాజ్, బాబ్జాన్ దంపతులకు ఒక కూతురు, కొడుకు ఉన్నారన్నారు. మెహతాజ్ పక్క గ్రామమైన డబురువారిపల్లికి చెందిన ఇర్ఫాన్(28)తో అనే వ్యక్తితో మూడు సంవత్సరాల నుంచి వివాహేతర సంబంధం కొనసాగిస్తోందన్నారు. ఈ మధ్య కాలంలో మెహతాజ్ మరొకరితోనూ చనువుగా మసలడంతో ఇర్ఫాన్ అనుమానం పెంచుకున్నాడన్నారు. దీంతో ఎలాగైనా మెహతాజ్‌ను చంపాలని నిర్ణయించుకున్న ఇర్ఫాన్ పథకం ప్రకారం గురువారం రాత్రి 11.30 గంటలకు మెహతాజ్ ఇంటికి వెళ్లి గొడవ పెట్టుకున్నాడన్నారు. ఆ తరువాత గొంతు నులిమి హత్య చేసి, ఇంటి వెనకవైపు నుంచి పారిపోయినట్లు తమ దర్యాప్తులో తేలిందన్నారు. సంఘటనపై విచారణ చేపట్టామని, నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ వెల్లడించారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణం డిఎల్ఆర్ కాలనీకి చెందిన వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాలనీకి చెందిన హరే రామ్ (48) రెండు సంవత్సరాల నుండి పక్షవాతం వ్యాధితో బాధపడుతున్నాడు.ఈనేపథ్యంలో మనోవేదనకు గురైన హరేరామ్ శుక్రవారం డిఎల్ఆర్ కాలనీ సమీపంలో గల రైల్వే ట్రాక్ మీద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు, మృతునిభార్య అశ్వర్థమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భార్య కాపురానికి రాలేదని...

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం తూమకుంట చెక్‌పోస్టులో గురువారం రాత్రి హనుమంతప్ప(30) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హనుమంతప్ప భార్య భర్తతో గొడవ పడి పుట్టింటికి వెళ్లింది. కాపురానికి రమ్మని పిలిచిన రాక పోవడంతో మనస్థాపానికి గురైన హనుమంతప్ప ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు కింద జారిపడి యువకుడు మృతి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో గురువారం రాత్రి రైలు కింద పడి వ్యక్తి మృతి చెందాడు. మడకశిరకు చెందిన రాజు (30) రైలు ఎక్కబోయి కాలు జారి రైలు కింద పడి మృతి చెందాడు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మోతుకుపల్లిలో ఘర్షణ

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం మున్సిపల్ పరిధిలోని మోతుకుపల్లిలో ఇద్దరు యువకులు మధ్య శుక్రవారం ఘర్షణ జరిగింది. ఈ సంఘటనలో రోహిత్ అనే వ్యక్తి తీవ్రగాయాల పాలయ్యాడు. చందు అనే యువకుడు రోహిత్ చేతి పై కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అయితే అప్పటికే దాడికి పాల్పడిన చందు పరారైనట్లు పోలీసులు తెలిపారు. ఘర్షణకు గల వివరాలు తెలియాల్సుందని పోలీసులు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో రెవెన్యూ ఉద్యోగికి గాయాలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

బత్తలపల్లి తహశీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న చక్రపాణి బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం బత్తలపల్లి తహశీల్దార్ కార్యాలయంలో విధులు ముగించుకుని ఇంటికి ద్విచక్రవాహనంలో వెళుతుండగా ధర్మవరం శ్మశాన వాటిక వద్ద కుక్కలు గొడవ పడుతూ ద్విచక్రవాహనం కిందకు దూసుకువచ్చాయి. దీంతో అదుపు తప్పి ద్విచక్రవాహనం కిందికి పడింది. ఈ ప్రమాదంలో చక్రపాణికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు పట్టణంలోని ప్రవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్య పరీక్షలు చేయించారు.

భార్యాభర్తలు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - బత్తలపల్లి

కుటుంబ కలహాలతో భార్యభర్తలు ఇరువురూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలోని ఈదుల ముష్టూరు గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. బత్తలపల్లి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గుజ్జల శ్రీరాములు, అశ్వని భార్యభర్తలు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరు వ్యవసాయంతో పాటు కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించు కుంటున్నారు. శ్రీరాములు మద్యానికి బానిసకావడంతో అశ్వని భర్తతో తరచూ గొడవ పడుతూ ఉండేది. ఈ నేపథ్యంలో గురువారం మరోసారి గొడవ పడ్డారు. ఆ సమయంలో క్షణికావేశానికి గురైన అశ్వని పురుగుల మందు తాగింది. ఇది గమనించిన శ్రీరాములు ఫ్యానుకు ఉరి వేసుకున్నాడు. పిల్లలు ఇది గమనించి గట్టిగా అరుస్తూ చుట్టుప్రక్కల వారికి సమాచారం ఇచ్చారు. దీంతో వారు ఇరువురిని కాపాడి వెంటనే బత్తలపల్లి ఆర్టీటి ఆసుపత్రికి తరలించారు. వారు ప్రస్తుతం అక్కడ చికిత్స పొందుతున్నారు. ఇరువురికి ప్రాణాపాయం తప్పినట్లు బంధువులు తెలిపారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు లేనందున కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

పట్టపగలే చోరీ

ప్రజాశక్తి-అగళి

మండలంలోని పి.బ్యాడిగెర గ్రామ ఎస్సీ కాలనీలో పట్టపగలే గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. ఎస్సీ కాలనీకి చెందిన గీతమ్మ, దేవరాజు భార్యాభర్తలు. రోజూ తరహాలోనే ఉదయం భోజనం చేసి ఇంటికి తాళం వేసి పొలానికి వెళ్లారు. వారు పొలం పనులు ముగించుకొని సాయంత్రం 5 గంటల సమయంలో ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. గుర్తు తెలి యని వ్యక్తులు తాళం పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో డోర్ లాక్‌లను పగలగొట్టి అందులో ఉన్న రూ.25వేల నగదు, 600 గ్రాముల వెండి ఆభరణాలు, ఇతర వస్తువులను ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు చోరీ జరిగిన ఇంటికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని ఎస్ఐ వీరేష్ తెలిపారు

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

గోరంట్ల- కొత్తచెరువు ప్రధాన రహదారిలో మామిళ్ళకుంట క్రాస్ సమీపంలో శుక్రవారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఆ సమయంలో అటుగా వెళుతున్న పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి సకాలంలో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. కొత్త చెరువు నుండి పుట్టపర్తికి వెళ్లే రహదారిలో రెండు ద్విచక్ర వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి అనంతపురం వెళుతున్న తరుణంలో రోడ్డు ప్రమాదానికి గురై నడిరోడ్డుపై గాయాలతో పడి ఉన్న ఐదుగురు యువకులను వారిని చూసి అంబులెన్స్ సాయంతో పుట్టపర్తి సూపర్ స్పెషాలి ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పుట్టపర్తి డిఎస్‌పి విజయ్ కుమార్ సందర్శించారు. గాయపడిన వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సిబ్బంది ద్వారా సమాచారం అందించి ఆసుపత్రికి రప్పించి బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గాయపడిన వారు పుట్టపర్తి మండలం పరిధిలోని వెంకట గారి పల్లి సాయినాథ్, వెంకట్రాముడు, ఎర్రంపల్లి మధు, రాచువారి పల్లి మనోహర్ ,చంద్రగా గుర్తించారు. వారిలో ఇద్దరికి కాళ్లు విరిగిపోగా, మరొకరికి తలకు, ఇంకొకరికి చేయి తలకు తీవ్రంగా గాయాలయ్యాయి, సంఘటన స్థలానికి కొత్తచెరువు సీఐ ఇందిరా, టిడిపి నాయకులు సాలక్క గారి శ్రీనివాసులు ,పుట్టపర్తి అంబులెన్స్ రమేష్ తదితరులు పరిశీలించారు.